
కథ

# వెలుతురు మరక

- వడలి రాధాకృష్ణ

"ఏమిటే మాటకు మాట చెప్పడం బాగా నేర్చు కున్నావ్! అయినా అంత బలుపా" అప్పుడు అమ్మ, ఇప్పుడు కూతురు. అనలు ఆడముండలు ఆడముండలు గానే ఉండాలి. బ్రతుకును భరించాలి. ఎదరు తిరిగితే....నేను మగాణ్ణి. ఖబడ్దార్!' అన్నది ఎవరోకాదు నా కన్నతండ్రి.... కాదు ఒక కసాయి తండ్రి... అదీ నేను 'చదువు కుంటాను నాన్నా!' అని అర్థించినప్పుడు. ఆడదాన్ని నన్ను నేను సబల అనుకొని ఓదార్చు కున్నా లోకం నాపై అబల అనే ముద్రవేసి పడేసింది. అబలనో సబలనో ....ఏమైనా నేనూ మనిషినే. అసలు ఆడదాన్నయి నంత మాత్రాన అణగారి పోతూనే బ్రతకాలా? మగాడి నిరంకు శత్వం ముందు బానిన బ్రతుకు బ్రతక వల్సిందేనా!' ఆలోచిస్తే నాకంటూ సమాధానం ఏమీ దొరకడంలేదు. తలచుకున్నప్పుడల్లా మనను చిందర వందరవుతుంది.



అందుకే నా చుట్టూ నేనో గిరి గీసుకున్నాను. గిరి అనడం కన్నా నా వ్యక్తిత్వాన్ని కాపాడుకోడానికి, నా ఆడమనసు పడే వేదనను తగ్గించు కోవడానికి నా కంటూ ఓ ఎత్తైన గోడను నిర్మించుకున్నాను. ఆ గీత దాటి మగాడంటూ ఎవరైనా లోపలికి ప్రవేశిస్తే నాలో తెలియని ఉద్వేగం. అప్పుడు నిజంగానే సబల నయిపోతాను.

నా ఆత్మాభిమానాన్ని కాపాడుకోవడం కోసం రాజీలేని సంఘర్షణ నాది. అసలునాకు తెలియ కుండానే బుట్టలో పడేయాలని చాలా మంది మగాళ్ళు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కారణం నేనో అందమైన ఆడదాన్ని. ఉరకలు వేసే పడుచుదనాన్ని సంతరించుకున్న దాన్ని కాబట్టి. నిలువుటద్దంలో చూస్తే నా సౌందర్యం నాకే అసూయ కలగ జేస్తోంది. అందుకేనేమో నన్ను పలకరించాలని, స్నేహం చెయ్యాలని చాలామంది ప్రయత్నం చేస్తూ ఉంటారు. కపటంతో వలపన్నాలని ప్రయత్నిస్తుంటారు. మానాన్న కూతురు బాగోగులు చూసుకొనే అమృతమూర్తి కాదుగా. అందుకే హద్దులు మీరుతున్న అవహేళనలు నన్ను కుంగదీస్తున్నాయి.

ఆడదాన్ని.... స్త్రీవాదమేకాదు, ఏవాదమూ నా తత్వానికి గిట్టుబాటుకాదు. కానీ మనుషులలోని పైశాచిక ప్రవృత్తే నన్ను కలవరపరుస్తోంది. అందుకు సబలనవ్వాలిగా! తప్పదుగా!!

ఇంటర్మీడియట్ తరువాత నా చదువు అటక ఎక్కినపుడే నన్ను కన్నవాడు నాకో పెళ్ళి సంబంధం తీసుకొచ్చాడు.

చూడు మంజీరా! ఇది నాకు లోకువైన సంబంధం. కుర్రాడికి ఉద్యోగంఉంది. ఆస్థిఅంతస్థు

గురించి నీకు చెప్పనవసరంలేదు. బంగారంతో నిన్ను ముంచెత్తగలడు. ఇక కట్న మంటావా ఏదో యాభైవేలు పడేస్తే చాలన్నారు. లాంఛనాలు, ఇచ్చిపుచ్చుకొనే వాటి ఊసు ఎత్తనేలేదు.

పైకి ఇది మంచి సంబంధమంటున్నా, నన్ను వదిలించుకుంటున్నందుకు లోలోపల మురిసి పోతున్నాడు నాన్న. సాధారణంగా మగజాతి కూతురుకి పెళ్ళిజేసి అత్తారింటికి పంపేస్తున్నామని కళ్ళలో నీటిపొరలతో ఇతరుల మనసులలో పెన్నానదిని పారింపజేయ ప్రయత్నిస్తారుగాని, తనకు కుంపటిలా తయారైన ఈడు వచ్చినదాన్ని ఎలాగోలా దించుకొని అల్లుడు అనే మరో మగ వ దార్ఢ్యపు గుండెల మీద సెగపొయ్యిని వెలిగిస్తుంటారని నాకు తెలియని విషయంకాదు.

మరోమగాడి పాపకంలోకి నెట్టివేసి తాము చేతులు కడుక్కుంటారు. చివరకు కన్నందుకు బాధ్యతల మొక్కుబడి తీరిపోయిందని సరిపుచ్చు కుంటారు. నావిషయంలో అది మట్టుకు నూటికి నూరుపాళ్ళు నిజం. ఎందుకంటే నాకు అమ్మలేదు. ఉన్న నాన్న ఎటువంటి ఉన్మాదో నాకు తెలుసు. తమ్ముడు చిన్నవాడు. లోకం గురించి తెలియని పసితనం వాడిది.

**నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్**

20జూలై 1969న నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ మొదటిసారిగా చంద్రగ్రహంపై కాలుమోపిన అంతరిక్ష వ్యోమగామి బజ్ ఆల్డ్రిన్ అనే సహ వ్యోమగామి ఆర్మ్‌స్ట్రాంగ్ కాలుమోపిన 19 ని॥లకు చంద్రునిపై కాలుమోపాడు 1969నుంచి 72 వరకు చంద్రుడు - భూమికి మధ్య సమాచార ప్రయాణ సంబంధాలు పెరిగాయి.

చెప్పాలంటే నాన్న ప్రయత్నాలతో నాకు నిమిత్తం లేదు. నా అభిప్రాయాలు నాకున్నాయి. మరొకరి ప్రాపకంలోకి భార్యఅనే ముసుగుతో నెట్టివేయ బడటం నాకు ఇష్టంలేదు. అందుకే ఆ సంబంధాన్ని కాదన్నాను. నెత్తీనోరూ బాదుకున్నాడు నాన్న. పెద్దగలాటా చేశాడు... భయపెట్టాడు... చివరికి కొట్టబోయాడు. అడ్డువచ్చిన తమ్ముడు గణేష్‌ని విసిరి పడేశాడు.

ఏమైనా సరే పెళ్ళికి 'ససేమిరా!' అన్నాను. అసలే అమ్మలేని ఇల్లు. ఆడదానికి ఆడదితోడుగా ఉండి ఉంటే నా మనసులో ఇంత ఆత్మసంఘర్షణ జరిగి ఉండేదికాదు. హృదయం పాషాణంగా మారి నాలోని జీవనోత్సాహమంతా హరించుకుపోయింది.

చివరికి ఆయనే సర్దుకొని నన్ను కూర్చోపెట్టి ఎందుకు పెళ్ళిచేసుకోవని అడిగాడు. 'ఎవరినైనా ప్రేమించావా!' అని నిలేశాడు.

'దానికి కారణం మీరే'నని తెగేసి చెప్పాను.

'నీ పెళ్ళికి? నేను కారణం ఎలా అవుతాను' ఆయన ముఖం నాకు అర్థం కాలేదు. ఆక్షణంలో అవధులు దాటుతూన్న భావోద్వేగం నాలో.

'అవును... ముమ్మాటికీ మీరే కారణం. మగాడినన్న అహంకారంతో అమ్మ మీద ఎంత ఆధిపత్యాన్ని చెలాయించేవారు. నిమిష నిమిషం మానసికంగా ఆమెను ఎంతగా హింసించేవారు. శారీరకంగా మొగుడు పెట్టిన కష్టాల్ని ఎన్ని అనుభవించింది. మీ పైశాచికత్వానికి అమ్మ గగ్గోలుపెట్టేది. చివరికి మీలోని ఆ శాడిజానికి ఆహుతి అయిపోయింది.

మీరు ఆఫీసునుండి రోజూ ఇంటికి వచ్చేసరికి మేమంతా భయంతో హడలిపోయేవాళ్ళం! నా మాటలకు పెద్దపులిలా విరుచుకుపడ్డాడు నా మీద.

అమ్మ తన మొగుడులో మార్పురావాలని దేవుడికి పూజచేయని రోజులేదు. పూజలు చేసి ఉపవాసముంటే 'తిండిమానేసి నాజూకుగా తయారవుతున్నావ్! ఎవడికోసమే!!' అని ఎద్దేవా చేసేవాడు. పురుషుడినన్న ఆధిపత్య ధోరణిని ప్రదర్శించి మమ్మల్ని పురుగుల కన్నా హీనంగా చూసేవాడు.

రెండుపూటలా భోజనం... మూడుపూటలా టిఫిన్లు.... గంటగంటకీ కాఫీ... చీకటి పడితే చాలు

మందు, కంపెనీ ఇవ్వమని ఇల్లాల్ని బలవంతం చేసేవాడు. పాలవాడితో, పేపరువాడితో మాట్లాడినా అనుమానం. పని మనిషికి జీతం దండగని నువ్వే ఇంటిమనిషీ, పనిమనిషీ అని తిట్టిపోసేవాడు.

భర్త అనే అహంకారం, భార్య అంటే భర్తను భరించాల్సిందే అన్న కుసంస్కారం కన్పించేది ఆయనలో. ఆవిడ పుట్టింటి వాళ్ళని ప్రతి దానికి కల్పించుకొని విమర్శించేవాడు. మొదట కాన్పులో అబ్బాయి పుడతాడనుకొంటే నేను పుట్టాను అని దెప్పిపొడిచేవాడు.

పిల్లల్ని కనడంలో ఆమెతప్పు ఏముంది? అమ్మ ఒంటరిగా కూర్చొని ఎక్కిఎక్కి ఏడవడం ఎన్నోసార్లు చూశాను. ఆమె గుండె బరువు నన్ను క్రుంగదీసేది. ఎప్పుడైనా పౌరుషం వచ్చి ఎదురు తిరిగితే ఆవిడను విచక్షణారహితంగా కొట్టేవాడు.

శారీరకంగాను, మానసికంగాను బలహీను రాలు కావడంతో అమ్మను నిరంతరం శాసిస్తూ ఉండేవాడు. అందుకే పెళ్ళి అంటే నాకు అసహ్యం... పురుష పుంగవులంటే పరమ అసహ్యం. పెద్దలు కుదిర్చిన పెళ్ళిచేసుకొని.... అందునా కర్కోటకానికి చిరునామా అయిన కన్న తండ్రి చూసినవాడిచేత తాళి కట్టించుకోవడం...

మరలా చరిత్ర పునరావృతమైతే....

అసలు ఆ అబ్బాయి ఎటువంటి వాడో... అతని అభిప్రాయాలు ఏమిటో... అమాయకురాలైన అమ్మలా జీవితాంతం నరకం అనుభవించడానికి నా అంతరంగం సిద్ధంగాలేదు.

నేను నా మనస్సులో మాటని తెగేసిచెప్పాను. అప్పుడు ఆయనదగ్గర సమాధానంలేదు. 'తప్పు చేసిన మనిషి ఆ తప్పుకు ఏమి సమాధానం వెతుక్కోగలడు?... మిన్నకుండి పోయాడు.

జీవితంపట్ల ఆశ ఆవిరయిన ప్రతిసారీ గణేష్ 'అక్కా!' అన్న వాత్సల్యభరితమైన పిలుపు నన్ను సేదతీరుస్తుంటుంది. హిరణ్యకశిపునికి జన్మించిన ప్రహ్లాదుడు నా తమ్ముడు. నాకు ప్రాణం అయినా, వాడిని నా ఉద్దేశాలకు దూరంగా ఉంచేదాన్ని.

'ఏయ్ మంజీ! నీ ఈడువాళ్ళు కులాసాగా పెళ్ళిళ్ళు చేసుకొని ఇద్దరేసి పిల్లల్ని కనిపడేస్తున్నారు. నువ్వేమిటే ఇలా జడపదార్థంలా!!' ప్రక్కింటి కాకరాల మాష్టారుగారి అమ్మాయి కాత్యాయిని గణేష్ బట్టల్ని ఇస్త్రీ చేస్తున్న నన్ను నిలదీసింది.

నా గుండె కనిపించని ఆ ఐరన్‌బాక్స్ కొలిమిలా రగిలిపోయింది. 'నేను అసలు పెళ్ళి చేసుకో కూడదనుకోవడానికి కారణం నువ్వు కూడాను' తెగేసిచెప్పాను.

'నేనా... నేనేం చేశాను' కాత్యాయిని ముఖం పాలిపోయింది. 'చేయకపోవడమేమిటి. మా క్లాస్‌మెట్ అంటూ ఎవడినో వెంటేసుకు తిరిగావ్. తర్వాత ప్రేమా దోమా అని కలకలం సృష్టించావ్! మాష్టారుకి చెప్పాపెట్టకుండా ఇంట్లోంచి పారిపోయావ్. అంతవరకు బాగానే ఉంది. తర్వాతకథ... నిన్ను మోసగించి చెప్పా పెట్టకుండా వెళ్ళిపోయాడు. అందుకే మోసం దగాలకు నిర్వచనం మగాడు అంటాను. కాత్యాయిని ఇక మాట్లాడలేదు ఆ విషయం గురించి.

ఆ క్షణంలో మగాళ్ళంటే నాలో 'పైశాచి కానుభూతి' కల్గింది. చిన్నప్పుడు లంగా పరికిణీలకి బదులు చుడీదార్‌లు, మిడ్డీలు వేసుకుంటే నాన్న నన్ను కొట్టిన బెల్టు దెబ్బలు నాకు గుర్తుకువచ్చి గుండె చెమర్చింది. కళ్ళు కృష్ణాజలపాతమయింది.

– – –

నా కళ్ళముందే పది సంవత్సరాలు ఇట్టే



సనాచి - విజయవాడ

గడిచిపోయాయి. పైబడుతున్న వయసు మార్పు, నాన్నలో ఇదివరకటి ఉధృతి ఇప్పుడు కానరావడం లేదు. పైగా ఈ మధ్య మంచం పట్టాడు. అది పశ్చాత్తాపం అని చెప్పలేనుగాని చాలావరకు మనిషి లొంగిపోయాడు.


కరస్పాండెన్స్ కోర్సులద్వారా పైచదువులు కొంతవరకు చదివి చిన్న ఉద్యోగం సంపాదించు కోగలిగాను. కొంత ఆర్థిక వెసులబాటు కల్గడంతో నాలోని ఉద్దేశ్యాలు మరింత దృఢపడసాగాయి. స్త్రీల సమస్యలకు స్పందించడం, సమస్యాన్వేషణ కోసం ప్రయత్నించడం నాలో ఒక భాగమై పోయింది.

పెళ్ళి అన్నా ప్రేమ అన్నా సరిపడదునాకు. రెండింటి ఉద్దేశ్యం ఒక్కటే. అబలగామారి బందీగా బ్రతకడం. ఒకమగాడి ఆధిపత్యపు గొడుగులో కాలం వెళ్ళబుచ్చడం. వైవాహికం పేరుతో అగ్రిమెంట్ కుదుర్చుకోవడం.

'వివాహబంధం' అనే చట్రంలో ఎక్కువ లబ్ధిపొందేది పురుష పుంగవులే. పిల్లలు, వ్యాపార ధోరణిలో వారి పెంపకం, చదువులు అవన్నీ ఇంటి ఆడదే భరించాలి. ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా రాత్రివేళ ముఖానికి నవ్వులు పులుముకొని జడమల్లె లతో బెడ్ పార్టనర్గా సుఖాలు అందిచడం...

## శ్రీశ్రీ ప్రభావం అనితర సాధ్యం

యస్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "వికాస సాహితి" సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీశ్రీ వర్ధంతి సభలోప్రసంగిస్తున్న డా॥ గోపులింగారెడ్డి, వేదిక పై ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్యులు, ప్రిన్సిపాల్ బి. రాంచందరరావు ఉన్నారు.



నేను గీసుకున్న గిరిలో నాకేం లోటులేదు ఇప్పుడు. నాన్న ఆలంబన కాదనుకున్నాను. తోడబుట్టిన తమ్ముణ్ణి ప్రయోజకుణ్ణి చేశాను. వాడు డిగ్రీపూర్తిజేసి ఓ చిన్న కంపెనీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు.

'మంజీరా! ఈ స్టేట్మెంట్ నువ్వే తయారు చెయ్యాలి. అందమైన నీచేయిపడితే స్టేట్మెంట్కి స్టేటస్ పెరుగుతుంది.' మా బాస్ ఏదో ఒంకతో నాతో పూసుకుతిరగడానికి ప్రయత్నించేవాడు.

'వెధవ మగబుద్ధి' ఖచ్చితంగా అనుకొనేదాన్ని నాలోనేను. 'మంజీ! నాజ్లో నాగార్జున మూవీ వచ్చింది. టాక్ బాగుంది. ఈ రోజు నాబర్త్డే... ఫస్ట్ షోకి పోదామా!!" గిరి ఆబగా అడిగేవాడు కళ్ళనిండా కైపు నింపుకొని. ఒళ్ళు మండిపోయేది. పదిరోజులకోమారు నా బర్త్డే అనేవాడు.

'బర్త్డే అయితే మీ భార్యామణితో వెళ్తేసరి!' సున్నితంగా చెప్పి ఒదిలించుకోబోయేదాన్ని.

'సర్లెండి! దాని దగ్గర ఏముంది. ఒట్టి విలేజ్ టైపు అయితేను' అనేవాడు. నేను పనిజేసే ఆఫీసులో మిగతావారి సంగతి సరేసరి. పెళ్ళి అయిన ఆడవాళ్ళను పెద్దగా పట్టించు కొనే వారు కాదు. అందరూ కావాలని నాతో కల్పించుకు మాట్లాడేవారు.

కొందరు తమంతట తాముగా మేరేజ్ ప్రపోజల్స్ చేసేవారు. మరికొందరు నాతో తాత్కాలిక సంబంధాల కోసం వెంపర్లాడారు. నేను పెళ్ళి చేసుకోనని, వైవాహిక వ్యవస్థ మీద నమ్మకం లేదంటే మరోమార్గంలో ట్రై చేసిన మగాళ్ళూ ఉన్నారు.

ఈ భూమి మీద కలకాలం ఎవరు మిగిలారు కనుక. కాలప్రవాహంలో పడి అందరిలాగే నాన్నకూడ కొట్టుకుపోయాడు. అప్పుడు నాలో ఏవిధమైన బాధగాని, భావన గానీ కల్గలేదు. ఇంతకాలంగా నా హృదయం అంత పాషాణమై పోయింది. ఇప్పుడు గణేష్ పట్ల బాధ్యత నాపై మరింతగా పెరిగింది.

వాడు ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నా తండ్రిచాటు మనిషే... ఇప్పుడు అక్కచాటుకు చేరాడు. వాడునోరు విప్పి ఎప్పుడూ చెప్పక పోయినా వాడి ఉద్దేశాలు, ఉత్సాహాలు, భావాలు,

ఇష్టాయిష్టాలువాడికుంటాయి. వాడికీ పెళ్ళీడు వచ్చింది. ఓ ఇంటివాణ్ణి చేస్తే నా బాధ్యత తీరిపోతుంది. పెళ్ళిపట్ల జీవన విధానంపట్ల నా నిర్ణయాలు, నా వ్యక్తిగతాలు ఆ చట్రంలో గణేష్‌ని కూడా బిగించాలనుకోవడం అన్యాయంగా తోస్తోంది. అందుకే ఆ దిశగా ప్రోత్సాహాన్ని అందించాను.

గణేష్‌ని పెళ్ళిచేసుకోబోయే అమ్మాయి తప్పక సుఖపడుతుంది. వాడు మెతకస్వభావి, సున్నిత మనస్సుకలవాడు, ఎప్పుడూ మంచితనానికి పోతుంటాడు, ఎవరికి ఏ సహాయం కావాల్సి వచ్చినా నేనున్నానని ముందు అడుగు వేస్తూంటాడు. ఒక్కోసారి అన్పిస్తూంటుంది, అటువంటి నాన్నకి ఇంతమంచి కొడుకు ఎలా పుట్టాడా అని. గణేష్ అమ్మపోలిక

'మీ గణేష్‌కి మా సంయుక్తని చేసుకోకూడదే!' ఒకసారి సరళ అడిగింది. ఆమెనాకు మంచి మిత్రురాలు. దాని చెల్లెలు ఎక్కడో హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉండి చదువుకుంటోంది. ఈ మధ్యనే కోర్సు పూర్తి అయిందట. పిల్లనుచూశాము. ఈడూజోడూ బాగానే ఉంటుందనిపించింది. గణేష్‌కికూడ తొలిచూపులోనే సంయుక్త నచ్చింది.

నా స్నేహితురాలు చెల్లెల్ని మరదలుగా చేసుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

రోజులు..... నెలలు..... సంవత్సరాలు పట్టుకుందామన్నా ఆగడంలేదు. పరుగులు తీస్తున్నాయి.

ఐదు... ఐదు సుదీర్ఘమైన సంవత్సరాలు గడిచి పోయాయి. గణేష్ ఇప్పుడు ఇద్దరు పిల్లలతండ్రి. వాడిమీద నాకు ఎన్నో ఆశలు. వాడి బ్రతుకు పూపరిమళం గురించి మరెన్నో కోరికలు.

కానీ నేను కట్టుకున్న మేడలు పేక మేడలవు తున్నాయి. చరిత్ర పునరావృతమవుతోంది. అది గణేష్ రూపంలోకాదు. సంయుక్తరూపంలో. ఒక్కోసారి స్నేహితురాలు చెల్లెలని సంయుక్తను చేసుకొని తప్పు చేశానేమో అన్పిస్తుంది. వాడు పడే మానసిక వేదన నాకు అర్థంకాని విషయం కాదు.

సంయుక్తది వింతధోరణి. సిటీలో ఉండి చదువుకున్న అమ్మాయి కావడంతో అన్నీ హైక్లాస్ భావాలు. మొగుణ్ణి ప్రతిదానికీ చేతకాని వాడుగా తీసిపడేస్తుంది. తనమాట నెగ్గాలని తీవ్ర ప్రతిఘటన చేస్తూ ఉంటుంది. తన కనుసన్నన లోనే అన్నీ జరగాలని సంయుక్త ఉద్దేశ్యం.

గణేష్ మెతక స్వభావి. ఎదిరించి గట్టిగా నిలబడి మాట్లాడలేదు. ఆఫీసునుండి లేటుగా వస్తే తప్పుపడుతుంది. పరాయి ఆడదానితో మాట్లాడితే హెచ్చరిస్తుంది. రానురాను సంయుక్తది ఇష్టా రాజ్యం అయిపోయింది. ఈ మధ్య కొత్తగా తన తల్లిదండ్రుల్ని కూడ దగ్గర పెట్టుకొని పోషిస్తేనే కాపురానికి వస్తాను లేకుంటే లేదంటూ పుట్టింటికి చెక్కేసింది.

ఏమీ చేయలేని పరిస్థితి గణేష్‌ది. నేనుకూడా చెప్పి చూశాను. విచక్షణా రహితంగా మాట్లాడింది. ఓ మధ్యతరగతి కుటుంబంలోని ఆడదాని కుండవలసిన అణకువ, మంచి మర్యాదలు, ఆమెలో పూర్తిగా కొరవడ్డాయి. సంయుక్త నడవడిక, పనితీరు చాలావికృతంగా ఉంది.

ఓ విధంగా పోల్చి చూస్తే మానాన్న కన్నా కృతకంగా ఉంది. సంయుక్తతీరు. 'చిన్న ఉద్యోగస్తుడివి. నీతో నాకు సుఖం ఎక్కడిది' అంటూ దుమ్మెత్తిపోస్తుంది.

ప్రక్కింటివాళ్ళు ఇదికొన్నారు, ఎదురింటి వాళ్ళు అది కొన్నారు, మావాళ్ళు కట్నం తక్కువని నిన్నుకొని పడేశారు. సరసాలు, సరదాలు లేని మొద్దువి, నువ్వూ ఓ మొగుడివేనా!' అంటూ ఇంట్లో గణేష్‌ని నిలవనీయడం లేదు.

ఒకప్పుడు ఆడదానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, వెనులుబాటుతనం అంటూ వెంపర్లాడిన నాకు అవన్నీ కొత్తగాను, వింతగాను అన్పిస్తున్నాయి. సంయుక్త ప్రవర్తనపై సాటి ఆడదానిగా నాకే అసహ్యం కల్గుతోంది.

ఆనాడు మగవాడికి సేవలు అందిస్తూ బానిస బ్రతుకు బ్రతకకూడదనుకున్నాను. స్వాతంత్ర్యాన్ని అనుభవించాలనుకున్నాను. అందుకే నేను స్వేచ్ఛావాదాన్ని ఎంచుకున్నాను. దానికి అనుగుణంగానే నా జీవితాన్ని మరల్చుకున్నాను.

ప్రతిచోట న్యాయమనేది రెండు వైపులా ఉంటుంది. దుర్నీతి కూడ అంతే. ఒకచోట జరిగిన అన్యాయాన్ని సార్వజనీనం చేయడానికి వీలులేదు.

ఆయా సందర్భాలను బట్టి మారుతూ పోతుంది.

నా అనుభవాల తాలూకు గుణపాఠంతో, నేను చూసిన పరిస్థితుల వలన స్త్రీకి విమోచన కావాలని కోరుకున్నాను. ఆ దిశగా నా నడకను సాగించాను. సంయుక్త మంచి ఆడజీవితం, నేను ఊహించుకున్న ఆహ్లాదభరిత జీవనం గణేష్ ద్వారా పొందగలదని ఆశపడ్డాను.

కానీ పరిస్థితి భిన్నంగాను, వేరేవిధంగా కన్పిస్తోంది. ఈ సామాజిక అంశాన్ని స్త్రీ,పురుష కోణాలలో చూడడం సరికాదు అన్పిస్తోంది.

ఏ స్త్రీ వాదమైతే నాకు స్ఫూర్తినిచ్చి, ఊపిరు లూది ముందుకు నడిపించిందో అది నలిగి చితికి పోతున్నట్లుంది. ఓ ఆడదాని మూర్ఖత్వం, అవివేకపు విధానాలకు మగాడు తలదించడం భరింప లేకుండా ఉన్నాను.

ఈ వాదాలన్నీ నీటిబుడగల్లా అన్పిస్తున్నాయి. వీటన్నిటికీ అతీతమైనది మానవతావాదం. ఇంతకాలం పెంచుకున్న విశ్వాసాలు నమ్మకాలు క్రమంగా కూలిపోతున్నట్లున్నాయి నాలో.

చరిత్ర ఎప్పుడు చూసినా ఏముంది. బలహీనుడిపై బలవంతుని దాడి, ఆధిపత్యం తప్ప. ఆ బలవంతుడు మగాడే అయి ఉండక్క రలేదు. ఆడదీ అతీతురాలు కాదని నిరూపిస్తోంది సంయుక్త.

ఇప్పుడు మానాన్న మీద పెంచుకున్న ఉన్మాద భావన కొంచెం కొంచెం సమసి పోతున్నట్లుంది. నాకు తెలుసు... సంయుక్త ఇక మారదు. కానీ మారుతుందన్న ఆశ నాలో సజీవంగా మెరుస్తూనే ఉంది.కారణం నేనూ ఓ సాటి ఆడదాన్ని కనుక.★

పుస్తకావిష్కరణ

# 'యుద్ధం'

వరంగల్లులో ఈ మధ్య 'యుద్ధం' కావ్య ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిధిగా డా॥ అద్దేపల్లి రామ్మోహన్ రావు గారు మాట్లాడుతూ "ప్రపంచం లోని అన్ని రంగాల్లోనూ రాజ్యమేలుతున్న అశాంతిపై; శాంతి ప్రకటించిన బ్రహ్మాండమైన విశ్వ యుద్ధమిది" అన్నారు.




కావ్యాన్ని ఆవిష్కరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, డా॥ అంపశయ్య నవీన్," ఒక గొప్ప శాంతి కాముకుడు రచించిన మహా "గొప్ప సాహితీ యుద్ధం ఇది" అన్నారు.

ప్రొ॥ యస్. లక్ష్మణమూర్తి మాట్లాడుతూ," మనిషిలో ఎంతో మంచితనం ఉంటే తప్ప ఇలాంటి కావ్యాలు సాధ్యపడవు. ఈ యుద్ధం సాహితీ ప్రపంచంలో నిలుస్తుంది", అన్నారు.

అష్టావధాని డా॥ ఇందారపు కిషన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ యుద్ధ కావ్యాన్ని డా॥ బన్న అయిలయ్య గారు ఎన్నో ఉదాహరణలో పరిచయం చేసారు. కాగా శ్రీ ముహమ్మద్ సిరాజొద్దీన్ దీన్ని రచించారు. ★


## పుస్తకావిష్కరణ వేదిక

**విజయవాడలో పుస్తకావిష్కరణ**
**అభిలషించే రచయితలకు ఆహ్వానం**

'చినుకు-శ్రీ వాగ్దేవి' సంయుక్తంగా
ప్రగతిశీలసాహిత్యగ్రంధాల
ఆవిష్కరణోత్సవానికి
సహకారాన్ని అందిస్తున్నాయని
తెలియచేస్తున్నాం.
ఉత్సాహం ఉన్న రచయితలు
చినుకు సంపాదకవర్గాన్ని
సంప్రదించండి

వివరములకు

**చినుకు సాహిత్య మాసపత్రిక**

27, 28. 3వ అంతస్థు, దత్తాస్ నయాబజార్,
రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ-3.